

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## చారులత

**భాష:** బెంగాలీ **రచన, సంగీతం, దర్శకత్వం:** సత్యజిత్ రే

**నటీనటులు:** సౌమిత్ర చటర్జీ(అమల్), మాధవీ ముఖర్జీ(చారులత), షైలేన్ ముఖర్జీ (భూపతి)

**విడుదల:** 1964




**భారతీయ నవ్య సినిమాకి** నిలువెత్తు రూపమయిన సత్యజిత్‌రే తన జీవితకాలంలో నిర్మించిన ముప్పైకి పైగా చలన చిత్రాల్లో అత్యంత భావావేశంతో కూడుకున్న చిత్రం 'చారులత'. ఆ చిత్రంలో అత్యంత వివేకమూ, అమితమయిన సునితత్వమూ, తనపైన తనకు గాఢమయిన విశ్వాసమూ కలిగిన అందమయిన స్త్రీ చారులత ముఖ్యాభినేత. ఆమె తన జీవితంలో ఎదిగిన తీరూ, అనుభవించిన ఒంటరితనమూ, తన అభీష్టాలను నెరవేర్చుకునే క్రమంలో ఆమె ముందుకు సాగిన వైనమూ ఈ చిత్రంలో ప్రధానాంశాలు. తన కుటుంబ జీవన పరిస్థితుల్లో చారులత తాను ఓ వైపు గొప్ప ప్రేమను పొందినట్టుగా కనిపిస్తూనే మరోవైపు అంతకంటే అధికంగా తృణీకార భావాన్ని అనుభవిస్తూ ఉన్నట్టు ఫీలవుతుంది. సత్యజిత్‌రే చారులత పాత్రని అత్యంత దగ్గరగా అధ్యయనం చేసి రూపొందించారు. ఆ పాత్ర మానసిక అంతర్లోకాలోకి ప్రవేశించి అర్థం చేసుకుని మరీ ఈ చిత్రాన్ని రూపొందించినట్టుగా కనిపిస్తుంది. సారళ్యతకూ, కృత్రిమత్వానికి నడుమ కనిపించే అన్యోన్య ప్రభావం చారులతలో గొప్పగా ఆవిష్కృతమైంది. రే భావుకుడిగా అత్యున్నతమైన ప్రతిభను కనబర్చారు.

నిజానికి సత్యజిత్‌రే ఏనాడూ స్త్రీవాదాన్ని ఆధారం చేసుకుని ప్రత్యేక సినిమాలు నిర్మించలేదు. కాని ఆయన చిత్రాల్ని పరిశీలిస్తే మహిళల ఎదుగుదల యొక్క పరిణామక్రమం స్పష్టంగా గోచరిస్తుంది. అందుకే ఆయన చిత్రాల్లోని స్త్రీ పాత్రలు కేవలం రక్త మాంసాలున్న మనుషులుగా మాత్రమే కాకుండా మనసున్నవారు, ప్రేమాస్పదులూ, ఆశించిన ప్రేమను అందుకోగలిగే దృఢ దీక్ష కలిగిన స్త్రీ పాత్రలే చిత్రాల్లో మనకు కనిపిస్తాయి. ఆయన చిత్రాల్లో కెల్లా చారులత మరింతగా మహిళా దృక్పథంతో నిర్మించిన చిత్రం.



'చారులత' వర్తమాన కథా, కథన చిత్రం కాదు. అది పీరియడ్ ఫిల్మ్. 1879 సంవత్సరకాలం నాటి బెంగాలీ కుటుంబ చిత్రీకరణ ఇందులో కనిపిస్తుంది. ఈ చిత్రం రవీంద్రనాథ్ టాగూర్ రచించిన కథ ఆధారంగా నిర్మితమయింది. 1958 ప్రాంతంలో రే, ఠాగోర్ జీవిత చారిత్రాత్మక చిత్రాన్ని గురించి పరిశోధన జరుపుతున్న కాలంలో ఠాగోర్ రచించిన 'నాస్తనీర్' అన్న లిఖిత ప్రతి కనిపించింది. దాంట్లో ఠాగోర్ జీవితపు ఛాయలు కొన్ని కనిపించడంతో ఆ చిన్న నవలని తీసుకుని సత్యజిత్ రే 1958 లోనే తన స్క్రిప్టును రాసుకున్నాడు. అయితే ఆ స్క్రిప్టుని మూలపెట్టేశారు సత్యజిత్‌రే.

నటి మాధవీ ముఖర్జీలో సంపూర్ణమయిన భారతీయ స్త్రీ ఛాయలు, లక్షణాలు, భారతీయ స్త్రీల భావాల్ని పలికించగలిగే ప్రతిభ కనిపించడంతో తిరిగి 'చారులత'ను నిర్మించాలనుకుని 1964 లో విడుదల చేశారు. చిత్ర కథాంశం విషయానికి వస్తే 1879లో కలకత్తా నగరంలో ధనవంతుడయిన యువకుడు భూపతి దత్తా నివసిస్తూ ఉండేవాడు. ఆయన 'సెంటినెల్' అనే ఆంగ్ల రాజకీయ వారపత్రికకు సంపాదకీయ బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రచురిస్తూ ఉంటాడు. ఆయన భార్య చారులత. అందమయిన ఆమె తన తీరిక కాలాన్ని అల్లిక పనిలో గడుపుతూ ఉంటుంది. దానికి తోడు బెంగాలీ సాహిత్యాన్ని ముఖ్యంగా నవలల్ని ఆమె అధ్యయనం చేస్తూ ఉంటుంది.

ఎప్పుడూ తన కార్యకలాపాల్లో మునిగి తేలుతూ బిజీగా ఉండే భూపతి తన భార్య ఒంటరితనాన్ని గమనిస్తాడు. చారులతకు తోడుగా ఉండడానికి తన పత్రిక వ్యవహారాల్లో మేనేజ్‌మెంట్ చేయడానికిగాను చారులత పెద్దన్నయ్య ఉమాపాదను, అతని భార్య మందాకినిని పిలిపిస్తాడు. కలకత్తాకు చేరుకున్న ఉమాపాద పత్రిక మేనేజర్ బాధ్యతలు స్వీకరించగా, మందాకిని ఇంటి వ్యవహారాల్లోకి వచ్చేస్తుంది. అయితే నిరక్షరాస్యురాలయిన మందాకిని చారులత జీవన వ్యవహారంపై ఎలాంటి ప్రభావాన్ని కలిగించలేక పోతుంది. చారులత ఎప్పటిలాగే తన పనుల్ని తాను చేసుకుపోతూ ఉంటుంది.

సరిగ్గా అదే సమయంలో భూపతికి వరసకి తమ్ముడయిన అమల్ తన సెలవుల్ని గడపడానికి వారి ఇంటికి వస్తాడు. అమల్ సాహిత్యాభిమాని. భూపతి సూచన మేరకు అమల్ తన వదిన చారులతతో సాహిత్య చర్చకు పూనుకుంటాడు. ఆమె సాహిత్యాధ్యయనానికి మరింతగా తోడ్పడతాడు అమల్. వారిద్దరి నడుమ సాన్నిహిత్యం పెరుగుతుంది. అసంకల్పితంగానే చారుని అమల్ వ్యక్తిత్వం ఆకర్షింపచేస్తుంది. ఆమె అమల్ ప్రభావంలో పడిపోతుంది. తన పనిలో నిమగ్నమయి ఉండే భూపతికి ఈ విషయాలేవీ తెలీవు. పట్టవు కూడా.

ఈ లోగా ఉమాపాద భూపతి పత్రికాఫీసులో పలు అవకతవకలకు పాల్పడ్డంతో పాటు తనకి అందుబాటులో ఉన్న డబ్బుతో పారిపోతాడు. అది తెలిసిన భూపతి జరిగిన మోసాన్ని తనకు ఆప్తుడయిన అమల్‌కి చెబుతాడు. కాని వదిన విషయంలో భూపతిని తానుకూడా మోసం చేసానేమోనన్న భావం పీడించగా భూపతిని కష్టపెట్టడం ఇష్టం లేక ఓ చిన్న ఉత్తరం రాసిపెట్టి అదే రాత్రి వెళ్ళిపోతాడు అమల్. తెల్లారింతర్వాత చారులత తీవ్ర నిరాశకు గురౌతుంది.

తర్వాత సెలవులు గడిపేందుకు కొంతకాలం భర్తతో బయటకు వెళ్ళొచ్చిన చారులత తన భావావేశాల్ని అదుపులోకి తెచ్చుకుంటుంది. కాని కలకత్తాకు తిరిగి రాగానే అమల్ రాసిన ఉత్తరం ఆమెలో గతస్మృతుల్ని తట్టి లేపుతుంది. తన వెనకాల్నే భర్త ఉన్నాడన్న విషయం గమనించకుండానే చారులత దుఃఖాన్ని నిలవరించలేక పోతుంది. భూపతి మౌనంగా ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోతాడు. కొంత సేపటికి తిరిగి వచ్చిన భూపతికి దుఃఖంలోంచి తెప్పరిల్లిన చారులత చేయిసాచి ఇంట్లోకి ఆహ్వానించే చిట్టచివర ఫ్రీజింగ్ షాట్‌లో చిత్రాన్ని ముగిస్తాడు రే. అయితే ఈ ముగింపు ఠాగోర్ తన కథకి చూపించిన ముగింపుకు భిన్నమయ్యింది.

మూలకథ చివర్లో బయటకు వెళ్ళిన భూపతి తిరిగి వచ్చి చారులతని తనతో పాటు తీసుకెళ్ళడానికి ముందుకు వస్తాడు. కాని చారులత అందుకు అంగీకరించదు. వారి బంధం తెగిపోతుంది. కాని సత్యజిత్‌రే సినిమా విషయం వచ్చేసరికి వారిద్దరినీ కలుపుతాడు. ఆనాటి వర్తమాన మధ్య తరగతి మానసిక స్థితిని పరిగణించో లేదా విస్తృత కళాత్మక రూపమయిన సినిమా మాధ్యమాన్ని దృష్టిలో ఉంచుకునో ఫ్రీజింగ్ షాట్స్‌లో వారి కలయికను చూపిస్తూ చిత్రాన్ని ముగించాడు.

మొత్తం మీద స్త్రీ కోణంలోంచి స్త్రీల మేధా పరిపక్వతను, మానసిక వికాసాల్ని అత్యంత ప్రతిభావంతమయిన చలన చిత్రరూపంలోకి అనువదించిన సత్యజిత్‌రే అత్యంత కళాత్మకమయిన సృష్టి 'చారులత'.:

✡✡✡

# మహానగర్

**భాష:** బెంగాలీ **రచన, సంగీతం, దర్శకత్వం:** సత్యజిత్ రే

**నటీనటులు:** అనిల్ చటర్జీ, మాధవీ ముఖర్జీ మొ.

**విడుదల:** 1963



**పితృస్వామ్య భావజాలం** వేళ్ళూనికుని అనధికారికంగా కుటుంబంలోనూ, సమాజంలోనూ రాజ్యమేలుతున్న వ్యవస్థలో, స్త్రీ తన కాళ్ళమీద తాను నిలబడడమూ, కుటుంబం గడపదాటి అడుగుపెట్టడమూ ఓ గొప్ప సందర్భమే. ఆ సందర్భం ఆ కుటుంబాన్ని ఆ కుటుంబంలోని పురుష వీక్షణాల్ని అతలాకుతలం చేస్తుంది. అంతదాకా పురుష దృక్పథానికి వస్తువుగా కనిపించిన స్త్రీ, వ్యక్తిత్వంతో ఎదిగే తీరు ఆ పరుష భావజాలానికి పెద్ద సంచలనంగానే కనిపిస్తుంది. అదే 50 ఏళ్ళ క్రితం స్త్రీ బయటి ప్రపంచంలోకి ఉద్యోగం కోసం వెళ్ళడమంటే సనాతన బ్రాహ్మణ మధ్య తరగతి కుటుంబ జీవితంలో ఎంతటి పరిణామమో 'మహానగర్' సినిమా వివరిస్తుంది. కలకత్తా మహానగరాన్ని అందులో నివసించే మధ్య తరగతి జీవుల సామాజిక, ఆర్థిక సంఘర్షణల్ని ప్రధానంగా ప్రొజెక్ట్ చేస్తుంది. పాత తరానికి కొత్త తరానికి మధ్య, సనాతన సంస్కృతికి పురోగామి దృక్పధానికి మధ్య జరిగే సంక్లిష్ట సంఘర్షణ మహానగర్‌లో ప్రస్ఫుటమవుతుంది. సత్యజిత్‌రే నిర్మించిన అన్ని చిత్రాల్లోలాగే మహానగర్‌లో కూడా భావనాత్మకమైన ఉద్వేగం ఆవిష్కృతమవుతుంది. సత్యజిత్‌రే మాటల్లోనే చెప్పుకోవాలంటే "సాధారణ మానవుణ్ణి, మనకు రోజూ రోడ్లపైన కనిపించే మనిషిని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని చలన చిత్రాత్మకమైన అన్వేషణ చేయడం అంత సులువు కాదు. స్పష్టాస్పష్టంగా

కనిపించే వినిపించే సాధారణ జీవన రేఖల్ని సినిమా చేయడం కష్టసాధ్యమే". అలాంటి కష్టాన్నే సత్యజిత్ రే తన 'మహానగర్'లో చిత్రీకరించి చూపారు.



ఓ మధ్య తరగతి కుటంబంలోని గృహిణి తన భర్త సూచన మేరకు ఆర్థికంగా తన కుటుంబానికి చేదోడుగా ఉండేందుకుగాను ఉద్యోగానికి వెళుతుంది. కాని తాను పనిచేసె స్థలంలో ఎదుర్కొనే పరిస్థితులు, బయటి ప్రపంచాన్ని చూసిన అనుభవ వెళుతుంది. కాని తాను పనిచేసే స్థలంలో ఎదుర్కొనే పరిస్థితులు, బయటి ప్రపంచాన్ని చూసిన అనుభవ పర్యవసానంగా ఆమె వ్యక్తిగా తనని తాను స్థిరీకరించుకుంటుంది. కాని ఆమె వ్యక్తిత్వ వికాసం ఆమె భర్తతో సహా ఇంట్లో అందరిపైనా తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. అప్పటిదాకా ఆమెను కేవలం గృహిణిగానూ స్త్రీగానూ చూస్తూ వచ్చిన ఆ కుటుంబ సభ్యులు ఆమె వ్యక్తిగా ఎదిగి జీతాలు, ఇంక్రిమెంట్లు, కమీషన్లు, అమ్మకాలు అంటూ మాట్లాడ్డం వారికి మింగుడుపడదు. ఆమె మామ ఆమెతో మాట్లాడ్డానికి ఇష్టపడడు. అత్తకి కూడా ఆమె స్వేచ్ఛ కంటగింపుగా తయారవుతుంది. చిన్నారి కొడుకు కూడా తన తల్లి అధిక సమయం ఉద్యోగం పనిమీద తనకి దూరంగా ఉండడంతో విచారపడతాడు. ఇక ఆమె భర్త కుటుంబ ఆర్థిక అవసరాల దృష్ట్యా ఆమె ఉద్యోగం చేయడాన్ని మొదట్లో ప్రోత్సహించినా క్రమంగా ఆమె ఎదుగుదలని భరించలేకపోతాడు. అతని మేల్ గేజ్ ఇబ్బందుల్లో పడుతుంది. ఇలా ఆమె ఉద్యోగిని కావడం వల్ల ఆమెకు వ్యక్తిత్వం వికిసితమై, వ్యక్తిగా తనని తాను వ్యక్తీకరించుకునే స్థితి కలిగితే మరోవైపు ఆమె పూర్ణపరివర్తన కుటుంబాని అతలాకుతలం చేస్తుంది. ఈ గందరగోళాన్ని సత్యజిత్‌రే 'మహానగర్' చిత్రంలో కళాత్మకంగా చూపిస్తాడు. ఇందులో రే ఇతర సినిమాలకి భిన్నంగా పాత్రల మానసిక అంతర్లోకాలకంటే బహిర్ స్థితినే చర్చించినప్పటికీ నగరమూ, ఉద్యోగమూ, కుటుంబమూ ఓ స్త్రీని ఎంతగా ప్రభావితం చేస్తాయో తనని తాను రూపొందించుకునే దిశలో ఆమె పడే యాతన, ఎదురు తిరిగే స్థితిని మహానగర్‌లో చూపిస్తాడు.

చిత్రం కథాంశానికి వస్తే కలకత్తా మహానగరంలో 1950వ దశకం తొలినాళ్ళకాలమది. రిటైర్ అయిన ఓ సనాతన భావాలుకల స్కూలు టీచర్ కుటుంబ జీవన చిత్రమది. నరేంద్ర మిత్ర రాసిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఓ మూడు గదుల ఇంటిలో తండ్రి, తల్లి, కొడుకు, కోడలు, స్కూలుకు వెళ్ళే కూతురు, ఓ చిన్నారి మనవడు కలిసి జీవిస్తుంటారు. ప్రియోగోపాల్ టీచర్‌గా పనిచేసి రిటైర్డ్ జీవితం గడుపుతుంటారు. అతని కొడుకు సుబ్రతా మజుందార్ ఓ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తూ ఉంటాడు. ఆ కుటుంబం మొత్తం అతని సంపాదన మీదే గడవాలి. ప్రియోగోపాల్‌కి కళ్ళద్దాలు లేకపోవడం వల్ల చూపు సరిగ్గా కనిపించడం లేదని బాధపడుతూ ఉంటాడు. చిన్న చెల్లి స్కూలు ఫీజు బకాయి చెల్లించాలి. ఇలా అనేక సమస్యలు ముప్పిరిగొనగా తన జీతం సరిపోని స్థితిలో ఓ మిత్రున్ని అప్పు అడుగుతాడు సుబ్రతో. కాని అప్పుపుట్టదు. అదే విషయాన్ని భార్య ఆరతితో చెపుతాడు. తన మిత్రుడి భార్య కూడా ఉద్యోగం చేస్తుందని ఆరతికి చెబుతాడు.

ఆ రాత్రి ఆరతి తీవ్రంగా ఆలోచిస్తుంది. పెరిగిపోతున్న అవసరాల దృష్ట్యా ఆరతికి ఉద్యోగ ప్రయత్నం ఆరంభిస్తాడు. రోజూ పత్రికల్లో వచ్చే ప్రకటనల్ని చదివి వినిపిస్తూ ఉంటాడు. ఓ రోజు కుట్టుమిషన్లు అమ్మే, సంస్థలో సేల్స్ గర్ల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసి ఉద్యోగం సంపాదిస్తుంది ఆరతి. ఆమె మామ ప్రియోగోపాల ఆరతి ఉద్యోగం చేయడానికి అసలు అంగీకరించడు. తీవ్రంగా అభ్యంతరం చెబుతాడు. కాని సుబ్రతో అదేమీ గమనించకుండానే ఆరతిని ఉద్యోగంలో చేరమంటాడు. తల్లి ఏడుస్తుంది. ఆరతి కొడుకు పింటు తల్లి తనను విడిచి వెళ్ళడం చూసి ఏడుస్తాడు. వీటన్నింటి మధ్యా ఉద్యోగంలో చేరిన ఆరతికి సేల్స్‌మన్‌లలో ఎడిత్ సైమన్ అనే ఆంగ్లో

ఇండియన్ సన్నిహితమవుతుంది. ఎడిత్ స్నేహంగా ఆరతికి లిప్‌స్టిక్ ఉపయోగించడాన్ని నేర్పుతుంది. సేల్స్ ఉమన్‌గా మొదట్లో కొంత సిగ్గుతో ఉన్న ఆరతి క్రమంగా పుంజుకుంటుంది. ఎడిత్ తన యజమానితో తమ హక్కుల కోసం ఎదురు తిరుగుతుంది. యజమాని ముఖర్జీ ఎడిత్‌ను వదిలించుకోవటానికి ఆరతిని వృత్తిలో అధికంగా ప్రోత్సహిస్తాడు..

ఆరతి ఇంట్లో పరిస్థితులు మరింత దిగజారిపోతాయి. సుబ్రతో తన సిగరెట్లకు కూడా ఆరతిపై ఆధారపడాల్సి వస్తుంది. మామ ప్రియోగోపాల్ అనారోగ్యం పాలవుతాడు. ఆరతి బ్యాగ్‌లో లిప్‌స్టిక్ చూసిన సుబ్రతో ఆమె మరీ ఆధునికమైపోతోందని భావిస్తాడు. ఓరోజు ఓ హోటల్ లో ఆరతి మరో పరాయి పురుషుడితో మాట్లాడ్డాన్ని పేపరు చాటున గమనిస్తాడు సుబ్రతో. ఆరతి యజమానిని కలిసి తనకి ఓ ఉద్యోగం ఇప్పించమంటాడు. మరోవైపు ఎడిత్ లేని సమయంలో ఆమె సేల్స్ చూసిన ఆరతి ఆమెను కలవటానికి ఇంటికి వెళుతుంది. అక్కడ వారి ఆర్థిక స్థితి చూసి చలించిపోతుంది. మరుసటి రోజు ఆఫీసు టాయిలెట్ గదిలో ఏడుస్తున్న ఎడిత్‌ను గమనించి ఆరతి విషయం తెలుసుకుంటుంది. ఎడిత్‌ని ఉద్యోగంలోంచి తీసిపారేసారని తెలుసుకుని యజమానిని నిలదీస్తుంది. ఎడిత్‌ని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడానికి అంగీకరించడు ముఖర్జీ. అప్పటికే భర్త వత్తిడి మేరకు ఉద్యోగం వదిలేయాలని రాజీనామాకు సిద్ధమైన ఆరతి భర్తకోసం కాకుండా ఎడిత్‌ను ఉద్యోగంలోకి తిరిగి తీసుకోకుంటే తన రాజీనామాను అంగీకరించమంటుంది. ముఖర్జీ ఖంగుతింటాడు. కొంత కాలం క్రితం వరకూ గృహిణిగా తమ ఇంటికే పరిమితమయిన ఆరతి తోటి ఉద్యోగిని కోసం మిత్రురాలి కోసం, హక్కుల కోసం, వ్యతిరేకిస్తూ తన ఉద్యోగానికి రాజీనామా ఇస్తుంది. ఆ పూర్ణపరిణామాన్ని సత్యజిత్‌రే ప్రతిభావంతంగా మన ముందుంచుతాడు. రాజీనామా చేసి బయటకు వచ్చిన ఆరతిని కలసిన భర్త సుబ్రతో ఈ విశాల కలకత్తా నగరంలో మనకి వేరే ఉద్యోగాలు మనకు దొరక్కపోవు అంటూ ఇద్దరూ కలిసి వెళతారు. ఆశావాహమైన రీతిలో చిత్రాన్ని ముగించినప్పటికీ 'మహానగర్'లో స్త్రీ సంఘర్షణ అందునా ఇంటి బయట అడుగుపెట్టి ఉద్యోగంలోకి వెళ్ళిన స్త్రీ ఎదుర్కొనే అనుభవాల్ని గొప్పగా వివరిస్తుంది. కథ మామూలుదే అయినా సత్యజిత్‌రే సమస్యని డీల్ చేసిన తీరు గొప్పగా ఉంటుంది.

'మహానగర్' స్త్రీ వికాసాన్ని జీవన యాత్రని చితబద్ధం చేసింది. ఈ చిత్రం భారతీయ సినిమా రంగానికి మాధవి ముఖర్జీలాంటి నటిని కూడా అందించింది.

✡✡✡